జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

## ఖమ్మం

శుక్రవారం | 21 | మార్చి | 2025 | పేజీలు:7

## అప్పులున్నా, వాగ్దానాలు మరువం



వెసులుబాటుతో 6 గ్యారెంటీలను అమలు చేస్తాం

నాలుగేళ్లలో 20 లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణమే లక్ష్యం

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

వివరాలు 7లో

# ఉగాది నుంచి ఆడబిడ్డలకు సన్నబియ్యం

**పెనుబల్లి/కల్లూరు :** ఉగాది నుంచి ఆడబిడ్డలకు ఇచ్చిన మాట ప్రకారం సన్న బియ్యం పంపిణీ చేయడం జరుగుతుందని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. పెనుబల్లి మండలంలో పర్యటించిన మంత్రి పొంగులేటి రామచంద్రపురంలో ఇందిరమ్మ ఇళ్లకు శంఖుస్థాపన చేశారు. అదేవిధంగా సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. పలు ప్రైవేట్ కార్యక్రమాల్లోనూ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవ

పెనుబల్లి మండలం పర్యటనలో మంత్రి పొంగులేటి

రామ చంద్రపురంలో ఇందిరమ్మ ఇళ్లకు శంఖుస్థాపన

కల్లూరులోనూ పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన





# సీపీఎం పోరాట ఫలితమే సీతారామ

ఈ ఎత్తిపోతల పథకంపై చిన్నచూపు

బడ్జెట్‌లో అరకొర నిధుల కేటాయింపు

తగిన నిధులు కేటాయించకపోతే ఉద్యమం

బడ్జెట్‌లో విద్యా, వైద్యం, వ్యవసాయం అన్నీ నిర్లక్ష్యమే..!

సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని, నున్నా

**ఖమ్మం ప్రతినిధి, (ప్రజా జ్యోతి) :** రాష్ట్ర ప్రభుత్వం తరపున ఆర్థిక మంత్రి మల్లు భట్టివిక్రమార్క రూ.3.04 కోట్లతో బడ్జెట్ ప్రవేశ పెట్టినా వాటిలో ఎంత మొత్తం ఖర్చు చేస్తారనేది సందేహాస్పదంగా ఉందన్నారు. క్రితంసారి రూ.2.91 లక్షల కోట్లతో బడ్జెట్ ప్రవేశపెట్టగా దానిలో ఖర్చు చేసింది రూ.2.38 లక్షల కోట్లు మాత్రమేనని తెలిపారు. ఈ రెండు మాసాలను కలిపి లెక్కలేస్తే రూ.2.66 లక్షల కోట్లకు చేరుకుంటామని ప్రభుత్వ అంచనాగా చెప్పారు. ఇంకా రూ.39వేల కోట్లు లోటు ఉంటుందన్నారు. ప్రస్తుత తరుణంలో ఆదాయం వచ్చే మిగతా 2లో

# ఉపయోగపడని వస్తువులను ఇతరులకు అందించాలి

**ఖమ్మం ప్రతినిధి, (ప్రజా జ్యోతి) :** మన ఇంట్లో మనకు అవసరం లేని వస్తువులు ఇతరులకు ఉపయోగ పడవచ్చని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. గురువారం జిల్లా కలెక్టర్, జిల్లా ప్రధాన ఆసుపత్రి ఎదురుగా వాల్ ఆఫ్ క్రైండ్ నెస్ గోడను అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ, ట్రైన్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ట, డిఎఫ్ఓ సిద్దార్థ్ విక్రమ్ సింగ్ లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ వాల్ ఆఫ్ క్రైండ్ నెస్ కార్యక్రమం క్రింద మిగతా 2లో

- సాయం చేయాలనుకున్న వారికి మంచి ప్లాట్ పాం వాల్ ఆఫ్ క్రైండ్ నెస్
- వాల్ ఆఫ్ క్రైండ్‌నెస్ గోడ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి
- కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్
- వాల్ ఆఫ్ క్రైండ్ నెస్‌ను ప్రారంభించిన కలెక్టర్



**కారేపల్లి, మార్చి 20 (ప్రజా జ్యోతి) :** సింగరేణి మండలంలో నేడు శుక్రవారం నుండి పదవ తరగతి పరీక్షలు ప్రారంభమవుతాయని ఎంఈఓ దుగ్గిరాల జయరాజు తెలిపారు. సింగరేణి మండల కేంద్రంలో గురువారం ఆయన మాట్లాడుతూ ఈనెల21వ తేదీనుంచి ప్రారంభమయ్యే పదో తరగతి పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు పూర్తి చేసమని తెలిపారు. ఈఏడాది మొత్తం 565 మంది రెగ్యులర్ విదార్థులు మిగతా 2లో

# విజయీభవ..!



నేటి నుంచి పది పరీక్షలు

ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

# సీపీఐ(ఎం) పోరాట ఫలితమే 'సీతారామ'

(మొదటి పేజీ తరువాయి)

పరిస్థితులు కూడా తగ్గాయ న్నారు. రియల్ఎస్టేట్ తగ్గటం, ఆర్థికసంక్షోభం, వృద్ధి రేటు తగ్గటం, పంటల రేట్లు పడిపో వడం తదితర కారణాలతో రాష్ట్రానికి రావాల్సిన ఆదాయం తగ్గుతుందన్నారు. ఇవన్నీ పరిగణలోకి తీసుకొని బడ్జెట్ ప్రవేశపెట్టారా? లేదా? అనే స్పష్టత లేకున్నా...ఈ జిల్లా మంత్రి ఆర్థికశాఖ మంత్రిగా ఉండి కూడా బడ్జెట్‌లో తీరని అన్యాయం జరిగిందన్నారు. సీతారామ ప్రాజెక్టుకు రూ.643 కోట్లు కేటాయించటం అంటే...ముగ్గురు మంత్రులు ఏమి ఆలోచిస్తున్నట్లు అని ప్రశ్నించారు. ఇలా బడ్జెట్ కేటాయించి ఎన్నేళ్లపాటు ఈ ఎత్తిపోతల పథకాన్ని కడతారని నిలదీశారు.

**సీపీఐ(ఎం) పోరాటాలతోనే 'సీతారామ'**

సీతారామ ప్రాజెక్టు దయాదాక్షిణ్యాలతో కాదు...పోరాటాలతో సాధించుకున్న ప్రాజెక్టు అని పోతినేని అన్నారు. 2002లో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో తమ్మినేని వీరభద్రం నాయకత్వంలో మహాప్రస్థానం పాదయాత్ర నిర్వహించామని, అప్పటి టీడీపీ ప్రభుత్వం వ్యంగ్యంగా వ్యాఖ్యానించిందన్నారు. ఆ తర్వాత 2004లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి వద్ద సీపీఐ(ఎం) తరఫున గెలిచిన నలుగురు ఎమ్మెల్యేలు పట్టుబడితే దుమ్ముగూడెం పేరుతో 2005 డిసెంబర్ 31న శంకుస్థాపన చేశారన్నారు. ఆ తర్వాత కాంగ్రెస్ ఎమ్మెల్యేల ప్రోద్బలంతో దుమ్ముగూడేన్ని రాజీవ్, ఇందిరాసాగర్ పేరుతో రెండు భాగాలు చేశారని గుర్తు చేశారు. బడ్జెట్‌లో తగిన కేటాయింపులు చేయకపో వడంతో ఖమ్మం నుంచి హైదరాబాద్ పాదయాత్ర మొదలు పెట్టామని, నకిరేకల్ వెళ్లేటప్పటికీ రూ.2వేల కోట్ల అంచనాతో కూడిన దానికి వెంటనే రూ.300 కోట్లు కేటాయిస్తున్నట్లు నాటి ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి కబురు చేయడంతో పాదయాత్ర నిలిపివేశామన్నారు. ఆ నాటి పాదయాత్రలో నాడు టీడీపీ జిల్లా అధ్యక్షుడిగా ఉన్న నేటి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సైతం పాల్గన్నారని తెలిపారు. కానీ 2007 నుంచి 2012 దాకా తగిన నిధులు కేటాయించలేదన్నారు. 2012లో తన నాయకత్వంలో మళ్లీ పాదయాత్ర చేపట్టామన్నారు. ఈలోగా తెలంగాణ ప్రభుత్వం రావడంతో 2016 ఫిబ్రవరిలో రూ.7,900 కోట్ల అంచనాతో కేసీఆర్ సీతారామ ఎత్తిపోతల పథకానికి శంకుస్థాపన చేశారని, 2018 నాటికి రూ.13వేల కోట్లకు అంచనా వ్యయం పెరిగిందన్నారు. 2023కు వచ్చేనాటికి రూ.18వేల కోట్లకు చేరిందన్నారు. ప్రస్తుతం సీతమ్మసాగర్, సీతారామ ప్రాజెక్టు రూ.19,800 కోట్లకు పెంచుకుంటూ వచ్చారన్నారు. గతేడాది మోటార్ల ద్వారా నీళ్లిచ్చి ప్రాజెక్టు ప్రారంభించినట్లు ప్రచారం చేసుకున్నారని తెలిపారు. ప్రస్తుతం రూ.443 కోట్లు ఎత్తిపోతలకు, రూ.53 కోట్లు డిస్ట్రిబ్యూటరీలకు కేటాయించారని తెలిపారు. 72 పేజీల బడ్జెట్‌లో నీటిపారుదలకు కేటాయించిన నాలుగు పేజీల్లో సీతారామ ప్రాజెక్టు ఊసే లేదన్నారు. ఆరు లక్షల ఎకరాల ఆయకట్టుతో డిజైన్ చేసిన ఈ ప్రాజెక్టు కింద మూడు లక్షలు నూతన ఆయకట్టు ఉందన్నారు. 3.50 లక్షల పాత ఆయకట్టును స్థిరీకరిస్తామన్నారని తెలిపారు. నాగార్జునసాగర్, పాలేరు, వైరా, లంకాసాగర్ కింద ఉన్న భూములను స్థిరీకరిస్తామన్నారు. ఎండిపోయే భూములు భట్టి విక్రమార్క నియోజకవర్గంలోనే ఉన్నాయన్నారు. బీఆర్ఎస్ సైతం సీతారామ ప్రాజెక్టును నిర్లక్ష్యం చేసిందన్నారు. ముగ్గురు మంత్రులుండి ఈ ప్రాజెక్టును ఇప్పుడు పూర్తి చేయకపోతే ఎప్పుడు చేస్తారని ప్రశ్నించారు. రూ.19వేల కోట్ల అంచనా వ్యయంలో కేవలం రూ.8వేలు కోట్లు ఖర్చు పెడితే ఇంకా రూ.11,800 కోట్లు ఎప్పుడు వెచ్చిస్తారన్నారు. ఇలా రూ.600, రూ.700 కోట్లు కేటాయిస్తూ పోతే ఎప్పటికి పూర్తి చేస్తారని ప్రశ్నించారు. ముగ్గురు కీలక మంత్రులుండి అంచనాలు రివైజ్డవుతూ పోతే ఎప్పటికీ ఈ ప్రాజెక్టు పూర్తవుతుందని ప్రశ్నించారు. రూ.3లక్షల కోట్లతో బడ్జెట్ పెట్టి రూ.600 కోట్లు సీతారామ ప్రాజెక్టుకు కేటాయించడమేంటని ప్రశ్నించారు. సీతారామ ప్రాజెక్టుకు తగిన నిధులు కేటాయించకపోతే ఉద్యమం చేపట్టక తప్పని చర్యలను ప్రభుత్వం తీసుకొస్తోందన్నారు. ఈ బడ్జెట్ చర్చల్లో వచ్చే అంశాలను పరిగణలోకి తీసుకుని తగిన నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో జిల్లా ప్రజల నిరసనను ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు.

**వ్యవసాయదారులకు అన్యాయం చేసేలా బడ్జెట్**

వ్యవసాయదారులకు అన్యాయం చేసేలా బడ్జెట్ కేటాయింపులు ఉంటున్నాయని పోతినేని అన్నారు. కౌలు రైతులకు భరోసా లేదు..రుణమాఫీ ఇంకా పూర్తికాలేదన్నారు. ఇంకా 20 లక్షల మందికి రుణమాఫీ చేయాల్సి ఉందన్నారు. కుటుంబంలో ఒక్కరికి మాత్రమే మాఫీ ఇచ్చారన్నారు. రూ.2 లక్షల పైబడిన రైతులకు మాఫీ చేయాలన్నారు. నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామన్న ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా 4.16 లక్షలకు పైగా ఇండ్లు కేటాయించాల్సి ఉండగా బడ్జెట్‌లో రూ.12,500కోట్లు మాత్రమే కేటాయించిందన్నారు. ఈ నిధులతో 2.50 లక్షల ఇండ్లు మాత్రమే పూర్తవుతాయన్నారు. యూనివర్శిటీల భూములు అమ్ముతామనటం సిగ్గుచేటన్నారు. విద్యా, వైద్యం అన్నీ ఈ బడ్జెట్‌లో నిర్లక్ష్యానికి గురయ్యాయన్నారు. ఓవైపు రైతులు ఆత్మహత్యలు చేసుకుంటుంటే వ్యవసాయానికి తగిన కేటాయింపులు లేవన్నారు. ఈ విలేకరుల సమావేశంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు నున్నా నాగేశ్వరరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు యర్రా శ్రీకాంత్,బండి రమేష్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై.విక్రమ్, గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

# ఉగాది నుంచి ఆడబిడ్డలకు సన్నబియ్యం

(మొదటి పేజీ తరువాయి )



సభలో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.... ప్రజల దీవెనలతో అధికారంలోకి వచ్చిన ఇందిరమ్మ ప్రభుత్వం 15నెలలు పూర్తి చేసుకుందని తెలిపారు. ఈ వ్యవధిలో మహిళలకు ఉచిత బస్సు హామీ నెరవేర్చామని ఇందుకు గాను ఇప్పటి వరకు 5,450 కోట్ల రూపాయలను ప్రభుత్వం ఆర్టీసీకి చెల్లించిందని పేర్కొన్నారు. రూ. 20,676కోట్ల రైతు రుణమాఫీ చేయడం జరిగిందని తెలిపారు. ఏడాదిలోనే 56వేల మందికి పైగా నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిది అన్నారు. రూ. 500కే గ్యాస్ అందించిన ఘనత తమదేనన్నారు. తాజాగా మూడు రోజుల క్రితం రాజీవ్ యువ వికాస్ అనే పేరుతో నూతన పథకానికి శ్రీకారం చుట్టడం జరిగిందని తెలిపారు. దీని ద్వారా ఒక్కో నియోజక వర్గంలో సుమారు 4000మందికి పైగా ఎస్సీ, ఎస్టీ బీసీ, మైనార్టీ నిరుద్యోగులకు ఉపాధి అవకాశం దొరుకుతుందని పేర్కొన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో 25లక్షల ఇళ్లు ఇచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీది అని గుర్తు చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన రూ. 7లక్షల కోట్లకు పైగా అప్పులకు ప్రతినెల రూ. 6500 కోట్ల రూపాయలను చెల్లిస్తున్నామని తెలిపారు. ఆ కారణంగానే కొన్ని హామీలను అమలు చేయడంలో జాప్యం జరుగుతుందని తెలిపారు. తల తాకట్టు పెట్టైనా ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తామని స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా రాబోయే నాలుగేళ్లలో ఇరవై లక్షల ఇళ్లు పేదలకు ఇవ్వడం లక్ష్యమని తెలిపారు. తొలి విడతలో ఈ ఏడాది నాలుగున్నర లక్షల ఇళ్లు ఇస్తున్నట్లు పేర్కొన్నారు. రైతుబంధు ఇచ్చామని, సన్న వడ్లకు క్వింటాకు రూ. 500బోనస్ కూడా ఇచ్చామని తెలిపారు. ఇన్ని చేస్తున్నా ప్రతి పక్షాలు ఓర్వలేక తమ పై విమర్శలు చేస్తున్నాయని ధ్వజమెత్తారు. రామచంద్రపురంలో కొంతమంది రైతులు ఏళ్లుగా ప్రభుత్వ అటవీ భూమిని సాగుచేసుకుంటున్నారని వాటికి ప్రభుత్వం తరుపున చట్టబద్ధత కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం టేకులపల్లి గ్రామంలో అవిరామ్ సర్వీస్ స్టేషన్ ను ప్రారంభించారు. స్థానికంగా ఉన్న పెద్దమ్మ తల్లి ఆలయాన్ని సందర్శించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఓ కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. అదేవిధంగా కల్లూరు మండలంలో పర్యటించిన మంత్రి పొంగులేటి ఎర్రబోయినపల్లి గ్రామంలో అంతర్గత సీసీ రోడ్లు, డ్రైన్ లకు శంకుస్థాపన చేశారు. పెద్దకోరుకొండి గ్రామంలో ఎస్సీ కమ్యూనిటీ హాల్ తో పాటు అంతర్గత సీసీ రోడ్లు, డ్రైన్లకు శంకుస్థాపన చేశారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సభల్లో మంత్రి ప్రసంగించారు.

# ఉపయోగపడని వస్తువులను ఇతరుకు అందించాలి

(మొదటి పేజీ తరువాయి..)



జిల్లా ప్రధాన ఆసుపత్రికి ఎదురుగా ఉన్న గోడ వద్ద ప్రజలు తమ ఇంట్లో అవసరం లేని వస్తువులు, పాత సామాన్లు, బట్టలు వదిలితే అవి అవసరం ఉన్నవారు తీసుకొని వెళ్తారని తెలిపారు. శుభ్రంగా ఉపయోగించదగిన, పాడైపోని దుస్తులు, బూట్లు, పుస్తకాలు, పాత్రలు, ఏదైనా ఇతర వస్తువులను వదిలి వేయాలని అన్నారు. వాల్ ఆఫ్ కైండ్ నెస్ గోడ వద్ద ఎట్టి పరిస్థితుల్లో ఆహార పదార్థాలు వదిలివేయొద్దని కలెక్టర్ తెలిపారు. వాల్ ఆఫ్ కైండ్ నెస్ దగ్గర వస్తువులను వాటికి ఏర్పాటు చేసిన సెల్ఫ్ లలో ఉంచాలని, తద్వారా అవసరమైన వారు వాటిని సులభంగా కనుగొనవచ్చు అని అన్నారు. వాల్ ఆఫ్ కైండ్ నెస్ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, వస్తువులను నేలపై విసిరేయడం, వదిలేయడం వంటివి చేయవద్దని అన్నారు. దయచేసి మీకు అవసరమైనది తీసుకోండి అని, అవసరం లేనిది వదిలేయండి అనే నినాదంతో వాల్ ఆఫ్ కైండ్ నెస్ పని చేస్తుందని అన్నారు. దయ యొక్క గోడ వద్ద ఉన్న వస్తువులను ఎవరైనా వారి అవసరం మేరకు తీసుకొని వెళ్ళవచ్చని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పి సిఇఓ దీక్షా రైనా, జిల్లా ప్రధాన ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. కిరణ్ కుమార్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఉప్పలపాటి సుబ్బారావు మృతి పట్ల నామ విచారం

**ఖమ్మం ప్రతినిధి, (ప్రజాజ్యోతి) :** వేంసూరు మండలం దూళ్లకొత్తూరు గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఉప్పలపాటి సుబ్బారావు అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. ఈ విషాద వార్త తెలుసుకున్న బీఆర్ఎస్ మాజీ లోక్‌సభా పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. సుబ్బారావు కుటుంబాన్ని ఫోన్ ద్వారా పరామర్శించిన నామ ఆయన పార్టీ కోసం చేసిన కృషిని, తమ మధ్య ఉన్న అనుబంధాన్ని స్మరించుకున్నారు. సుబ్బారావు నిబద్ధత నాయకుడని రాజకీయ ప్రస్థానం ప్రారంభం చేసిన తొలి నాళ్ల నుంచి తనతో పాటు పయనించారని, ఆయన సేవలు మరిచిపోలేనివని నామ తెలిపారు. సుబ్బారావు మృతి పార్టీకి, కుటుంబ సభ్యులకు తీరని లోటుగా నామ పేర్కొన్నారు. సుబ్బారావు ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థించిన నామ, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. మాజీ ఎంపీ నామ ఆదేశాలు మేరకు క్యాంప్ కార్యాలయ ఇంచార్జి కనకమేడల సత్యనారాయణ, బిఆర్ఎస్ నాయకులు మోరంపూడి ప్రసాద్ రావు, నామ వ్యక్తిగత కార్యదర్శి జి నాగరాజు తదితరులు వేంసూరు మండలం దూళ్లకొత్తూరు గ్రామం వెళ్లి సుబ్బారావు పార్థివ దేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు.



# విజయీభవ..!

(మొదటి పేజీ తరువాయి..)



ఇందులో 80 మంది ప్రైవేట్ పాఠశాల విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. వీరికోసం కారేపల్లిలో మోడల్ స్కూల్, హైస్కూల్, కోమట్లగూడెం మొత్తం మూడు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. పరీక్ష నిర్వహణ కోసం 47 మంది ఇన్విజిలేశుర్లు, ముగ్గురు చొప్పున చీఫ్ సూపర్డెంట్ , డిపార్ట్మెంట్ ఆఫీసర్లు, పేపర్ కస్టోడియంలు ఉంటారని తెలిపారు. డీ.ఈ.ఓ సోమశేఖర శర్మ సూచన మేరకు ప్రతీ పరీక్షాకేంద్రంలో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. పరీక్షలు ఉదయం 9.30 నుండి 12:30గంటల వరకు జరుగుతాయని, విద్యార్థులు పరీక్షకు ఒక గంట ముందుగా చేరుకోవడం మంచిదన్నారు. విద్యార్థులు హాల్ టికెట్ తప్పనిసరిగా పరీక్ష కేంద్రానికి తీసుకు రావాలన్నారు. పరీక్షా కేంద్రాల్లో సెల్ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులు అనుమతించరని, పరీక్షా కేంద్రాల దగ్గర లోని జిరాక్స్ సెంటర్ల మూసివేత, 144 వ సెక్షను అమలులో ఉంటుందన్నారు. ఇప్పటికే పరీక్షకు సంబంధించిన అన్ని మెటీరియల్లు మండలానికి చేరుకుందన్నారు. పరీక్ష రాసే విద్యార్థులు ఎలాంటి ఆందోళనకు గురికాకుండా, ప్రశాంతంగా పరీక్షలు రాయాలని ఎంఈఓ సూచించారు.

# ధర్మ రక్షణ కోసం నిరంతర కృషి





**పనిచేసే వారికే పదవులు**

**కాషాయ జెండా గడపగడపకు**

**స్థానిక ఎన్నికల్లో విజయం లక్ష్యం**

**బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు**

**ఖమ్మం ప్రతినిధి (ప్రజా జ్యోతి) :** భారతీయ జనతా పార్టీ (బీజేపీ) ఖమ్మం జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన నెల్లూరి కోటేశ్వరరావు, ధర్మ రక్షణ, ప్రజా శ్రేయస్సు, పార్టీ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని శ్రీరామచంద్రుని సన్నిధిలో ప్రమాణం చేశారు. పార్టీ అధిష్టానం తనపై ఉంచిన గౌరవప్రదమైన బాధ్యతలకు కృతజ్ఞతలు తెలిపిన ఆయన, జిల్లాలో బీజేపీ ప్రతిష్ఠను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు కట్టుబడి ఉన్నట్లు ప్రకటించారు.

**పనిచేసే వారికే పదవులు..**

పార్టీ సిద్ధాంతాల కోసం కష్టపడే కార్యకర్తలకు, నాయకులకే జిల్లా నాయకత్వం పదవులు, బాధ్యతలు కట్టబెడుతుందని కోటేశ్వరరావు స్పష్టం చేశారు. డాంబికంతో ఏమీ చేయకుండా నాయకత్వం ఆశించే వారు తమ శైలిని మార్చుకోవాలని హెచ్చరించిన ఆయన, గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు పార్టీలో మార్పు తప్పనిసరని ఉద్ఘాటించారు. “పనిచేసే వారికి గౌరవం ఇవ్వడంలో ఎటువంటి రాజీ ఉండదు. ఫలితాలు చూపించాల్సిన అవసరం ఇప్పుడు పార్టీకి ఎంతైనా ఉంది,” అని ఆయన అన్నారు.కాషాయ జెండా గడపగడపకు కాషాయ జెండాను చేతిలో పట్టుకోవడం కాదు, దాని ఆవశ్యకతను ప్రతి గడపకు తీసుకెళ్లాలని కార్యకర్తలకు ఆయన పిలుపునిచ్చారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల గుండెలను తాకేలా ప్రచారం చేయాలని సూచించిన కోటేశ్వరరావు, ఇప్పటివరకు టైంపాస్‌తో కాలం గడిపిన వారు స్వభావం మార్చుకోవాలని, లేకుంటే ఇంటివద్దే ఉండాలని ఆదేశించారు. “ప్రతి కార్యకర్త జెండా ఉన్నతిని ప్రజలకు వివరించాలి. ఇకనుంచి అలసత్వానికి తావు లేదు,” అని ఆయన హెచ్చరించారు.ప్రజల సమస్యలే పరిష్కారం. ప్రజల చిన్న కష్టంలోనూ కార్యకర్త అందుబాటులో ఉండాలని, వారి సమస్యల పరిష్కారమే పార్టీ కర్తవ్యమని ఆయన పేర్కొన్నారు. 24 గంటలూ నాయకులు, కార్యకర్తలకు అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చిన కోటేశ్వరరావు, గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ప్రజా సమస్యలపై దృష్టి సారించాలని నాయకులకు సూచించారు. “ప్రజల ఆనందాలు, బాధలను పంచుకుంటేనే వారి విశ్వాసం సంపాదించగలం. అదే పార్టీ విజయానికి పునాది,” అని ఆయన వివరించారు. స్థానిక ఎన్నికల్లో విజయం లక్ష్యం రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ బలాన్ని చాటేందుకు కలిసికట్టుగా పనిచేయాలని ఆయన నాయకులు, కార్యకర్తలను కోరారు. త్వరలో కార్యచరణ ప్రణాళికను ప్రకటిస్తామని చెప్పిన కోటేశ్వరరావు, ప్రతి క్షణం దేశ సేవకు అంకితం చేసి, ప్రజల విశ్వాసం చొరగొనాలని పిలుపునిచ్చారు. “సాంకేతికతను బలంగా వినియోగించుకుని, ప్రజలకు సంక్షేమ పథకాలను చేరవేయాలి. పార్టీ కుటుంబంగా ఐక్యంగా నడిస్తేనే విజయం సాధ్యం,” అని ఆయన ఉద్ఘాటించారు. విమర్శలను స్వాగతిస్తూ. విమర్శలను స్వాగతించి, వాటిని పరిష్కరించే మార్గాలను అన్వేషించాలని కోటేశ్వరరావు సూచించారు. “విమర్శలు మన దృఢ నిశ్చయాన్ని పెంచుతాయి. ప్రతి నాయకుడు, కార్య కర్త దీన్ని గుర్తుంచుకోవాలి,” అని ఆయన పేర్కొన్నారు. చివరగా, “మనం చరిత్ర సృష్టించే సామర్థ్యం ఉన్న వాళ్లం. ప్రజలపై నమ్మకంతో, సిద్ధాంతాల పట్ల నిబద్ధతతో ముందుకు నడుద్దాం,” అని ఆయన ఆహ్వానించారు.ప్రసంగం ముగింపులో ఆత్మీయ సమ్మేళనం త్వరలో నిర్వహిస్తామని చెప్పిన కోటేశ్వరరావు, “జై శ్రీరామ్, భారత్ మాతాకీ జై” అంటూ నినాదాలతో సభను ముగించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుసంపూడి రవీందర్, కొండపల్లి శ్రీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు తప్పిన ప్రమాదం



**ఖమ్మం ప్రతినిధి, (ప్రజా జ్యోతి) :** గురువారం ఏదులపురం మున్సిపాలిటీ పరిధిలోని ఏదులాపురం జడ్పీహెచ్ఎస్ హైస్కూల్లో గల పిల్లలు ఆటలు ఆడుకునే స్థలంలో విద్యుత్ తీగల గల కరెంటు స్తంభం ప్రమాధకరంగా ఉన్నది. పిల్లలు ఆటలు ఆడుతుండగా కరెంటు ఎర్త్ వస్తుందని అన్నారు. పిల్లలు మూడు సంవత్సరాల నుండి ఎవరు పట్టించుకోక చాల ఇబ్బందికి గురవుతున్నారు. ఈ విషయం ఎదులాపురం జడ్.పి.హెచ్.ఎస్ ప్రధానోపాధ్యాయురాలు శివకుమారి మరియు ఉపాధ్యాయులు కాంగ్రెస్ పార్టీ ఖమ్మం జిల్లా నాయకులు భూక్య సురేష్ నాయక్ దృష్టికి తీసుకొచ్చారు. ఈ విషయంపై విద్యుత్ శాఖ ఏ ఈ గారినీ భూక్యా.సురేష్ నాయక్ సంప్రదించగా 200 మీటర్లు సర్వీస్ వైరు కావాలి అని కోరగా వెంటనే స్పందించి సర్వీస్ వైర్ ను తెప్పించి మార్పించడం జరిగింది. ఈ సర్వీస్ వైరుకు ఖర్చుల నిమిత్తం రూ 7 వేల రూపాయలు కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు సురేష్ నాయక్ చిన్నారులను దృష్టి లో పెట్టుకొని పిల్లల ప్రాణాలు ప్రమాదం నుండి కాపాడడానికి తన వంతు సహాయం చేసినారు. ఈ విషయంపై ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయులు, విద్యార్థిని,విద్యార్థులు,తల్లిదండ్రులు, ఎదులాపురం ప్రజలు భూక్యా సురేష్ నాయక్ గారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

# సత్తుపల్లి పి.వి.ఎన్ కాలనీ సమస్యలు పరిష్కరించాలి

**ఐ.ఎన్.టి.యు.సి బ్రాంచ్ కార్యదర్శి తీగల క్రాంతి కుమార్**



**సత్తుపల్లి, మార్చి 20 (ప్రజా జ్యోతి) :** కొత్తగూడెం ఏరియా ఐ.ఎన్.టి.యు.సి వైస్ ప్రెసిడెంట్ రజాక్ ఆదేశాల మేరకు సత్తుపల్లి ఐ.ఎన్.టి.యు.సి బ్రాంచ్ కార్యదర్శి తీగల క్రాంతి కుమార్ మరియు ఐ.ఎన్.టి.యు.సి బృందం సత్తుపల్లి పి.వి.ఎన్ కాలనీ సమస్యలు పరిష్క రించాలని జే.వి.ఆర్ ఓసి ప్రాజెక్ట్ ఆఫీసర్ ప్రహ్లాద్ మరియు ప్రాజెక్టు ఇంజనీర్ శ్రీనివాస రావులకు వినతిపత్రం గురువారం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సత్తుపల్లిలో ఉద్యోగుల కుటుంబాలు నివసించుటకు సింగరేణి యాజమాన్యం సుమారు మూడు సంవత్సరాల క్రితం సింగరేణి క్వార్టర్స్ నిర్మించినప్పటికీ సంవత్సరాలు గడుస్తున్న ఇప్పటివరకు కూడా కాలనీలో మౌలిక సదుపాయాలు సరిగ్గా లేక ఉద్యోగులు ఇబ్బంది పడుతున్నారని తెలియజేశారు.సింగరేణి సంస్థ నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యంలో 72 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తిలో సింగరేణిలో ఎక్కడ లేని విధంగా కొత్తగూడెం ఏరియా సత్తుపల్లి నుండి సుమారు 13.5 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేస్తున్నప్పటికీ మౌలిక వసతులు లేక కార్మికులు ఇబ్బంది పడుతున్నారని తెలియజేశారు. ఉద్యోగుల సంక్షేమం విషయమై యాజమాన్యం చొరవ చూపాలని కోరారు. ముఖ్యంగా కాలనీ లో ఉద్యోగులు వివిధ శుభకార్యాల నిర్వహణ కోసం కమ్యూనిటీ హాల్ వెంటనే నిర్మించాలని , కాలనీ కాంపౌండ్ వాల్ ప్లాస్టింగ్ చేపించి కలరింగ్ వేపించాలని , ఫిల్టర్ బెడ్ మరియు ఎలక్ట్రికల్ సబ్ స్టేషన్ లా చుట్టూ ఫెన్సింగ్ వేపించాలని , వాకింగ్ ట్రాక్ , కాలనీ కార్మిక వాడలలో లైటింగ్ , కాలనీ అటవీ ప్రాంతానికి దగ్గరలో ఉన్నందున కాలనీ ప్రహరీ చుట్టూ ఓవర్ హెడ్ లైటింగ్ , ఓపెన్ జిమ్,సూపర్ బజార్ , కాలనీ నుండి ఉద్యోగులు డ్యూటీకి వెళ్లే మార్గంలో స్మశాన వాటిక ఉండడంవల్ల ఇబ్బంది పడుతున్నారని, చుట్టూ ప్రహరీ గోడ నిర్మించాలని , కాలనీ పట్టణానికి శివారులో ఉండటంవల్ల ఉద్యోగుల కుటుంబాల భద్రత నిమిత్తం సెక్యూరిటీ చెక్ పోస్ట్ ఏర్పాటు చేయాలని కోరారు. ప్రాజెక్ట్ ఆఫీసర్ సానుకూలంగా స్పందించి తమపై అధికారులతో చర్చించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో రామారావు ( ఫిట్ సెక్రెటరీ , జె.వి.ఆర్ ఓసి ), బాలాజీ (ఫిట్ సెక్రటరీ ,కిష్టారం ఓసి ) నాగేశ్వరరావు ( ఫిట్ సెక్రటరీ ,జె.వి.ఆర్ సి.హెచ్.పి ),బ్రాంచ్ నాయకులు కాసర్ల సమ్మయ్య,అసిస్టెంట్ ఫిట్ సెక్రటరీ కోటి ఐ.ఎన్.టి.యు.సి కమిటీ నాయకులు పొట్టి కిరణ్, రషీద్,మురళి,బాలకృష్ణ, షద్రక్ బాబు ఇతర ముఖ్య నాయకులు ఉద్యోగులు పాల్గొన్నారు.

## వాహనాలకు ప్రైవేటు ట్రావెల్స్ నుంచి సీల్డ్ టెండర్ల ఆహ్వానం

**జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డా. కళావతి బాయి**

**ఖమ్మం ప్రతినిధి, (ప్రజా జ్యోతి) :** జిల్లాలో గల వివిధ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుండి ల్యాబ్ శాంపిల్ లను కలెక్ట్ చేస్తూ వాటిని తెలంగాణ డైగ్నోస్టిక్ హబ్, ప్రభుత్వ ఆసుపత్రి ఖమ్మంనకు చేర్చుటకు (5) వాహనాలు సమకూర్చేందుకు ప్రైవేట్ ట్రావెల్స్ నుండి సీల్డ్ టెండర్ దరఖాస్తులను కోరుచున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. బి. కళావతి బాయి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వాహనం నెలకు 2 వేల 500 కిలోమీటర్లు తిరగాలని, ఒక్కొక్క వాహనంనకు నెలకు 33 వేల రూపాయలు అద్దె చెల్లించ బడుతుందని, వాహనాల రిజిస్ట్రేషన్ (5) సంవత్సరాల లోపు ఉండాలని, ఎల్లో ప్లేట్ వెహికల్స్ మాత్రమే అనుమతించ బడతాయని తెలిపారు. ప్రైవేట్ ట్రావెల్స్ ఏజెన్సీ వారు ఈ అవకాశం ఉపయోగించుకొని తమ సీల్డ్ టెండర్ దరఖాస్తులను జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం నందు ఏర్పాటు చేసిన టెండర్ బాక్స్ నందు మార్చి 29 సాయంత్రం 5 గంటల లోపు సమర్పించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి ఆ ప్రకటనలో తెలిపారు.

## దివ్యాంగులకు ఉచితంగా కృత్రిమ పాదాల పంపిణీ

**ఖమ్మం ప్రతినిధి, (ప్రజా జ్యోతి) :** ఖమ్మం ఎన్ఎస్పి గట్టయ్య సెంటర్ రోటరీ క్లబ్ ఆఫ్ ఖమ్మం రోటరీ సర్వీస్ సెంటర్ లో 60 మంది దివ్యాంగులకు ఉచితంగా కృత్రిమ పాదాలను పంపిణీ చేయడం జరిగింది . దీనికి అమెరికాలోనే ఏకం సంస్థ వారు 2,61,000 వేల రూపాయలను సహాయంగా అందించారు . కృత్రిమ పాదాలతో పాటు బూట్లు కూడా ఇవ్వడం జరిగింది . ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జీవి మల్ అధినేత గుర్రం ఉమామహేశ్వరరావు , మహేశ్వరి గోల్డ్ అధినేత అరవపల్లి అశోక్ పాల్గొని రోటరీ సేవలను కొనియాడారు . ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ మల్లాది వాసుదేవ్ , రోటరీ క్లబ్ అధ్యక్షులు నల్లమోతు రవీంద్రనాథ్ , కార్యదర్శి దొడ్డపనేని సాంబశివరావు , కో ఆర్డినేటర్ పసుమర్తి రంగారావు , ఏ జి భూషణ్ రావు , మేకల బిక్షమయ్య , నాగేశ్వరావు , సుధాకర్ , ముత్తయ్య తదితరులు హాజరయ్యారు .



# మల్లు స్వరాజ్యం పోరాట స్ఫూర్తి ప్రతి మహిళకు ఆదర్శం

కారేపల్లి, మార్చి 20, ప్రజా జ్యోతి: తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు మల్లు స్వరాజ్యం పోరాట స్ఫూర్తి ప్రతి మహిళకు ఆదర్శమని ఐద్వా మండల నాయకురాలు కేసగాని నీలిమ అన్నారు. గురువారం సింగరేణి మండలం గాంధీనగర్‌లో ఐద్వా ఆధ్వర్యంలో వీరతెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధురాలు మల్లు స్వరాజ్యం 3 వర్ధంతి సభ ఈసం లక్ష్మి అధ్యక్షతన జరిగింది. మల్లీ స్వరాజ్యం చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కేసగాని నీలిమ మాట్లాడుతూ తెలంగాణలో భూమి కోసం భుక్తి కోసం వెట్టి చాకిరి విముక్తి కోసం జరిగిన సాయుధ పోరాటంలో మల్లు స్వరాజ్యం వీరోచితంగా పోరాడి పేద ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిందన్నారు. నేటికీ సమాజంలో మహిళలు వివక్షకు గురవుతున్నారని, మహిళా చట్టాలను కఠినంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం మహిళలకు ప్రత్యేక రక్షణ చట్టం చేయాలని మహిళలకు అన్ని రంగాలలో ఆర్థిక చేయుత ఇవ్వాలని ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. మల్లు స్వరాజ్యం పోరాటాలను ఆదర్శంగా తీసుకోని



కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు కు ఉద్యమించాలని కోరారు. ఈకార్యక్రమంలో ఐద్వా నాయకురాళ్లు కె.జ్యోతి, ఎస్.నాగమణి, కె.పున్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

## కాకతీయ యూనివర్సిటీలో ఐఐటి అండ్ వీ సెమిస్టర్ ఫలితాల్లో సత్తా చాటిన ప్రియదర్శిని



**ఖమ్మం ప్రతినిధి, (ప్రజా జ్యోతి) :** కాకతీయ యూనివర్సిటీ ప్రకటించిన ఐఐటి, వి సెమిస్టర్ ఫలితాలలో ప్రియదర్శిని డిగ్రీ కళాశాల విద్యార్థులు తమ సత్తాను చాటుకున్నారు. 9.0 జిపిఏ పైగా 9 మంది విద్యార్థులు మరియు 8.0 జిపిఏ పైగా సాధించిన విద్యార్థులు 112 పైగా ఉన్నారు. ఫలితాల్లో రాణించిన విద్యార్థులను కళాశాల చైర్మన్ డాక్టర్ కాటేపల్లి నవీన్ బాబు పేరుపేరునా అభినందించారు. విద్యార్థుల ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి మంచి ఫలితాలు సాధించిన విద్యార్థిని స్ఫూర్తిగా తీసుకొని విద్యార్థులందరూ డిగ్రీ కోర్సు చక్కగా పూర్తి చేసుకుని భవిష్యత్తు తరాలకు ఆదర్శంగా ఉండాలని వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ వి రామారావు, అకాడమిక్ డైరెక్టర్ యం. శివకుమార్ మరియు అధ్యాపకులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల కోసం రేషన్ కార్డుల డ్రైవ్

**ఖమ్మం ప్రతినిధి, (ప్రజా జ్యోతి) :** టీడబ్ల్యూజేఎఫ్ నేతల విజ్ఞప్తి మేరకు గురువారం నుంచి జర్నలిస్టుల రేషన్ కార్డుల కోసం స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తామని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పిన్ రెడ్డి శ్రీనివాసరెడ్డి హామీ ఇచ్చారు. కలెక్టరేట్ లో బుధవారం తనను కలిసిన టీడబ్ల్యూజేఎఫ్ నేతలతో అదనపు కలెక్టర్ మాట్లాడారు. కలెక్టర్ ఐడీవోసీ (కలెక్టరేట్) మీసేవ కేంద్రం ద్వారా జర్నలిస్టులు గురు, శుక్ర, శనివారాల్లో అప్లికేషన్ చేసుకుంటే వెంటనే ఆ దరఖాస్తులను పరిశీలించి రేషన్ కార్డు ఇచ్చేందుకు చర్యలు చేపడుతామన్నారు. ఆన్ లైన్ అయిన వెంటనే తహశీల్దారు, డీఎస్ వో జాప్యం లేకుండా అప్రూవ్ చేసేలా చూస్తామన్నారు. ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న వారు తిరిగి అప్లికేషన్ చేయాల్సిన అవసరం లేదని సూచించారు. మీ సేవ కేంద్రాల అక్ నాలెడ్జ్మెంట్ తీసుకు వస్తే వెంటనే రేషన్ కార్డు మంజూరయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. చేర్పులు, మార్పుల వంటివి ఉంటే కూడా అప్లికేషన్ చేసుకోవచ్చని సంబంధిత చర్యలనూ వెంటనే చేపడుతామని హామీ ఇచ్చారు. అదనపు కలెక్టర్ ను కలిసిన వారిలో టీడబ్ల్యూజేఎఫ్ ఖమ్మం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పల్లా కొండల్ రావు, కొత్తపల్లి శ్రీనివాసరెడ్డి, నాయకులు సయ్యద్ ఖదీర్, దువ్వా సాగర్, సీవీఆర్ శ్రీనివాస్, వెగినాటి మాధవరావు, కూరాకుల గోపీ, మానుకొండ రవికిరణ్, స్వేచ్ఛ సాగర్, సుభాన్, మధుసూదన్, పీటీఐ నాగేశ్వరరావు, ఉపేందర్, అర్షద్, కిరణ్, గణేష్, రవి, శరత్ తదితరులు ఉన్నారు.

## నాయకులందరూ కలిసికట్టుగా పనిచేయాలి

### బీజేపీ జిల్లా అధ్యక్షులు నెల్లూరు కోటేశ్వరావు



**తల్లాడ, మార్చి 20 (ప్రజా జ్యోతి) :** నాయకులంతా కలిసికట్టుగా పనిచేసి పార్టీ బలోపేతం కోసం కృషి చేయాలని బిజెపి జిల్లా అధ్యక్షులు నెల్లూరు కోటేశ్వరావు సూచించారు. గురువారం ఆయనను తల్లాడ మండల అధ్యక్షులు చల్లా నాగులుతో పాటు పార్టీ సీనియర్ నాయకులు ఆపతి రామారావు మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందించి శాలువాతో సన్మానించారు. నూతన అధ్యక్షుడినీ తల్లాడ బిజెపి మండల అధ్యక్షుడు చల్లా నాగులు ఆధ్వర్యంలో గురువారం అందించి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి పార్టీ ఉపాధ్యక్షుడు సంగీతం సాయిచంద్, జిల్లా నాయకులు రాయల రమేష్, కిషన్ మోర్చా అధ్యక్షుడు చౌద నాగేశ్వరరావు, ఎస్సీ మోర్చా అధ్యక్షుడు వేము అశోక్, ఓబీసీ మోర్చా నాయకులు చల్లా



నరసింహారావు, యువ మోర్చా నాయకులు కటిక నరసింహారావు, ఉదయ్, అభి, మండల నాయకులు గుండాల గురునాథం, రామకృష్ణ పాల్గొన్నారు.

## విద్యారంగాన్ని విస్మరించిన రాష్ట్ర బడ్జెట్ : పి.డి.ఎస్.యూ




**కారేపల్లి, మార్చి 20, (ప్రజా జ్యోతి) :** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన తొలి బడ్జెట్ కేటాయింపుల్లో విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేశారని,తక్షణమే బడ్జెట్ కేటయింపులు కి సవరణలు చేసి విద్యారంగానికి 30 % నిధులు కేటాయించాలని డిమాండ్ చేస్తూ ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థుల ఐక్యత (పి.డి.ఎస్.యూ) అధ్వర్యంలో సింగరేణి మండల కేంద్రంలో గురువారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పి.డి.ఎస్.యూ జిల్లా నాయకులు స్టాలిన్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన తొలి బడ్జెట్ లోనే విద్యారంగానికి కేవలం (23,108కోట్లు) శాతం 7.57% మాత్రమే నిధులు కేటాయించి విద్యాబిమానులను, విద్యార్థులను నిరాశపరిచిందని అన్నారు. తన ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించిన విధంగా కనీసం 15 శాతం నిధులు కూడా ఇవ్వకపోవడం అన్యామని అన్నారు. ప్రభుత్వ విశ్వవిద్యాలయాల అభివృద్ధిని కనీసం ఐదు వేల కోట్లు అవసరం ఐతే కేవలం ఐదు వందల కోట్ల మాత్రమే కేటాయించారు. ప్రభుత్వ విద్యారంగ బలోపేతం కోసం కృషి చేస్తామని చెప్పిన టిఆర్ఎస్ ఆచరణలో కార్పొరేట్ కు కొమ్ము కాసిందని అదే బాటలో కాంగ్రెస్ నడవాలనుకుంటుందా స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. బడ్జెట్ కేటాయింపులు లో విద్యారంగానికి చేసిన ప్రతిపాదనలు సవరించి 30% నిధులు నిధులు కేటాయించాలని దీనికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బాధ్యత తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఖమ్మం జిల్లాకు చెందిన మంత్రి భట్టి విక్రమార్క, తుమ్మల నాగేశ్వరావు,పొంగులేటి శ్రీనివాసరావు ఖమ్మం జిల్లాలో ప్రభుత్వ విశ్వవిద్యాలయ ఏర్పాటు పై అసెంబ్లీ వేదికగా ప్రకటన చేయకపోవడం దూర్మార్గం అన్నారు. పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్, రియంబర్స్మెంట్ విడుదల చేయకపోవడం వల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు పడుతున్నారని ఆ అంశంను పరిగణలోకి తీసుకుని ప్రత్యేక నిధులు బడ్జెట్లో కేటయింపులు చేయాలని అన్నారు. ప్రభుత్వ వసతి గృహ ,గురుకుల లు విద్యార్థులకు మెస్ చార్జీల పెంపు, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజనం వసతి ఏర్పాటు వంటి అంశాలపై దృష్టి కేంద్రీకరించాలని కోరారు. గత ప్రభుత్వం లాగా విద్యా వ్యతిరేక కార్యకలాపాలకు కాకుండా తాజా ప్రభుత్వం విద్యా అనుకూల ప్రభుత్వం గా ఉండాలి ఆశాభావం వ్యక్తంచేశారు. తక్షణమే బడ్జెట్ ప్రతిపాదనలకు సవరణ చేసి, ప్రొఫెసర్ కొఠారి కమిషన్ ప్రతిపాదించిన విధంగా రాష్ట్ర బడ్జెట్లో విద్యారంగానికి 30% నిధులు కేటాయించాలి సూచించారు. ఈ కార్యక్రమంలో పి.డి.ఎస్.యూ నాయకులు రాము, మహేష్, వంశీకృష్ణ, రాజు, రాకేష్, సురేష్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

## గాజాలో హింసకు పూర్తి బాధ్యత అమెరికాదే

### పోతినేని, నున్నా




**ఖమ్మం ప్రతినిధి, (ప్రజా జ్యోతి) :** గురువారం గాజాపై ఇజ్రాయిల్ దాడులు మళ్ళీ చేయటంపైన సిపిఎం ఖమ్మం జిల్లా కమిటి తీవ్రంగా ఖండిరచింది. గురువారం దాడులకు నిరసనగా నిరసన ప్రదర్శన నిర్వహించడం జరిగింది. సిపిఎం జిల్లా కార్యాలయం సుందరయ్య భవనం నుండి ప్రదర్శన బయలుదేరి ఎన్.ఎస్.పి. క్యాంప్లోని నిర్మల్ హృదయ్ స్కూల్ సెంటర్ వరకు జరిగింది. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శివర్గసభ్యులు యర్రా శ్రీకాంత్ అధ్యక్షతన జరిగిన సభలో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ పాల్గొని మాట్లాడుతూ గాజాపై ఇజ్రాయిల్ భీకర దాడుల వలన 413 మంది పాలస్తీనీయులు మరణించారని, అమెరికా ప్రోద్బలంతో ఇజ్రాయిల్ మరోమారు గాజాపై మారణకాండకు తెగబడిరదని విమర్శించారు. రంజాన్ మాసంలో భీకర వైమానిక దాడులతో విరుచుకుపడి పాలస్తీనీయుల ప్రాణాలు హరించిందని అన్నారు. హమాస్ స్థావరాలే లక్ష్యంగా రాత్రి వేళల్లో విచక్షణారహితంగా భూతల, వైమానిక దాడులకు పాల్పడిరదని తెలిపారు. ఈ దాడుల్లో పిల్లలు, మహిళలు అధిక సంఖ్యలో మృతి చెందారని తెలిపారు. మృతిచెందినవారిలో సామాన్యులే అధిక సంఖ్యలో ఉన్నారని అన్నారు. ఇజ్రాయెల్కు పూర్తి నైతిక, ఆయుధ శక్తి సామర్థ్యాలను సమకూర్చి వెనుక నుండి ట్రంప్ ప్రభుత్వమే గాజాలో హింసా కాండకు కారణమైందని విమర్శించారు. అమెరికా ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలని హెచ్చరించారు. ఆర్థిక, రాజకీయ మద్ధతు ఇవ్వడం ద్వారా ఇజ్రాయిల్ను ఉసిగొల్పి గాజాను అమెరికా నాశనం చేసిందని విమర్శించారు. ఇజ్రాయిల్ చర్యల వలన మరో విడత ఉద్రిక్తతలు మొదలయ్యాయని అన్నారు. ప్రతి ఒక్కరూ కాల్పుల విరమణ ఒప్పందానికి కట్టుబడి ఉండాలన్నారు. మేధావులు, అభ్యుదయకాముక శక్తులు, ఐక్యరాజ్యసమితి గాజాలో ప్రజలకు రక్షణగా నిలబడాలని, కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఇరు వర్గాలు పాటించేలా చూడాలని కోరారు. పార్టీ జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ గాజాలో ఇజ్రాయిల్ సృష్టిస్తున్న మారణహెూమాన్ని భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట్), ఖమ్మం జిల్లా కమిటీ తీవ్రంగా ఖండిస్తుందని అన్నారు. గాజాపై ఇజ్రాయిల్ చేసిన వైమానిక దాడుల ఫలితంగా మహిళలు, పిల్లలతో సహా 400 మందికి పైగా పాలస్తీనీయులు దుర్మరణం చెందారని ఆవేదన వ్యక్తం చేశారు. 2023 నాటి నుండి పాలస్తీనీయుల మరణాల సంఖ్య 62 వేలు దాటిందని వీరిలో అత్యధికులు అమాయక పౌరులేనని విచారం వ్యక్తం చేశారు. పాలస్తీనాపై ఇజ్రాయిల్ మారణకాండను ఆపేలా ఇజ్రాయిల్ను కట్టడి చేయాలని, తక్షణమే నిర్ణయాత్మక చర్యలు తీసుకోవాలని సిపిఎం పార్టీ అంతర్జాతీయ సమాజానికి, ముఖ్యంగా ఐక్యరాజ్యసమితి భద్రతా మండలికి విజ్ఞప్తి చేస్తుందని అన్నారు. పాలస్తీనా ప్రజలపై ఇజ్రాయిల్ దాడుల పట్ల భారత ప్రభుత్వం మౌనం పాటించడం సరైంది కాదని అన్నారు. భారత ప్రభుత్వం మౌనం వీడాలి, కొనసాగుతున్న హింసను ఖండిరచాలి. పాలస్తీనా ప్రజలకు సిపిఎం పార్టీ సంఘీభావం ప్రకటిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లాకమిటి సభ్యులు నందిపాటి మనోహర్, ఖమ్మం 1టౌన్ కార్యదర్శి నాగుల్మీరా, 2 టౌన్ కార్యదర్శి బోడపట్ల సుదర్శన్, జిల్లా నాయకులు ఆర్.ప్రకాష్, నర్రా రమేష్, ముదాం శ్రీను, చెరుకుమల్లి కుటుంబరావు, సదానందం, చింతల రమేష్, నామా లక్ష్మీనారాయణ, పారుపల్లి కృష్ణారావు, దేవళ్ళ వీరబాబు, పాపారావు, యర్రా రంజిత్, హిమాం, శీలం వీరబాబు, లక్ష్మీనారాయణ, నర్సింగరావు, పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

## ఠాను నాయక్ వర్ధంతి సందర్భంగా పలువురి నివాళులు



**రఘునాధపాలెం, (ప్రజా జ్యోతి) :** నాడు నిజాం నిరంకుశ పాలనకు దొరలకు భూస్వాములకు వ్యతిరేకంగా భూమికోసం భుక్తి కోసం వెట్టి చాకిరి విముక్తి కోసం పోరాడి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో అమరుడైన శ్రీ జాటోత్ ఠాను నాయక్ వర్ధంతి సందర్భంగా గురువారం ట్యాంకు బండు లో ఉన్న విగ్రహానికి పూలమాలలు వేసినా ఖమ్మం జిల్లా దొడ్డి కొమరయ్య సినిమా నిర్మాణ కమిటీ వారు మరియు తెలంగాణ టీచర్ ట్రైబల్ ఫెడరేషన్ వారు ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో టిజిటిటిఎఫ్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు మాలోత్ రామారావు, ఖమ్మం జిల్లా దొడ్డి కొమురయ్య సినిమా నిర్మాణ కమిటీ చైర్మన్ ఎస్.కె అబ్దుల్ రహిమాన్, కన్వీనర్ దామాల జయ, కమిటీ సభ్యులు భూక్యా బాలాజీ, దేశ బోయిన రాము, ఖమ్మం పట్టణ నావి బ్రాహ్మణ కమిటీ అధ్యక్షులు యలమందల జగదీష్ మహబూబాబాద్ జిల్లా వైస్ చైర్మన్ రావులపాటి శ్రీనివాసరావు టీజీ టిటిఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జరపల బన్సీ లాల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అజ్మీర బాబురావు ఖమ్మం జిల్లా అధ్యక్షులు అజ్మీర బన్సిలాల్ జిల్లా ప్రధాన కార్యదర్శి బానోతు జగ్గీలాల్ ఏన్కూర్ మండల టీజీటీఫ్ ధ్యక్షులు లకావత్ రామ్ లాల్ కామేపల్లి మండల అధ్యక్షులు బోడా నాగు జిల్లా గౌరవ అధ్యక్షులు భానోత్ వీరభద్రం. తదితరులు పాల్గొని విజయవంతం చేశారు

# ధాన్యం కొనుగోలుకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు

**కొనుగోలు కేంద్రాలలో అవసరమైన మౌలిక వసతుల కల్పన**

**2 లక్షల 58 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు 344 కేంద్రాల ఏర్పాటు**

**రబీ మార్కెటింగ్ సీజన్ ధాన్యం కొనుగోలుపై సంబంధిత అధికారులతో సమీక్షించిన జిల్లా కలెక్టర్**



**ఖమ్మం ప్రతినిధి, (ప్రజా జ్యోతి) :** రబీ మార్కెటింగ్ సీజన్ లో ఖమ్మం జిల్లాలో రైతులు పండించిన ధాన్యం మద్దతు ధరపై కొనుగోలు చేసేందుకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. గురువారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డితో కలిసి 2024-25 రబీధాన్యం కొనుగోలుపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ గత ఖరీఫ్ సీజన్ లో ఖమ్మం జిల్లాలో విజయవంతంగా ధాన్యం కొనుగోలు చేయడం జరిగిందని అన్నారు. ప్రస్తుత అంచనా ప్రకారం రబీ సీజన్ కు సంబంధించి లక్షా 85 వేల మెట్రిక్ టన్నుల సన్న రకం ధాన్యం, 73 వేల మెట్రిక్ టన్నుల దొడ్డు రకం ధాన్యం, మొత్తం 2 లక్షల 58 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయబోతున్నామని అన్నారు. గత సీజన్ లో ధాన్యం రవాణా అంశంలో ఎక్కడైనా చిన్న, చిన్న ఇబ్బందులు వస్తే వాటిని పునరావృతం కాకుండా చూడాలని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో మొత్తం 344 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని, రైతులకు అనుకూలంగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు ఉండాలని కలెక్టర్ తెలిపారు. ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే ట్యాబ్ ఎంట్రీ చేసేలా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ తెలిపారు. దాన్యం కొనుగోలు కేంద్రాల ఇంచార్జ్, సిబ్బందికి అవసరమైన శిక్షణ అందజేయాలని కలెక్టర్ సూచించారు. ధాన్యం నాణ్యత ప్రమాణాలపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని కలెక్టర్ తెలిపారు. ప్రాథమిక అంచనా ప్రకారం ఏప్రిల్ రెండవ వారం నుంచి ధాన్యం కోతలు ప్రారంభమవు తాయని, జిల్లాలో వరి పంట కోతల ప్రకారం కొనుగోలు కేంద్రాలకు నాణ్యమైన ధాన్యం తీసుకుని వచ్చే షెడ్యూల్ పకడ్బందీగా తయారు చేయాలని, కొనుగోలులో ఎక్కడా ఒత్తిడి లేకుండా క్రమ పద్ధతిలో ధాన్యం తీసుకుని వచ్చే విధంగా రైతులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ తెలిపారు. వ్యవసాయ శాఖ విస్తరణ అధికారులు గ్రామాల వారీగా సన్న రకం ధాన్యం ధ్రువీకరణ చేసి కొనుగోలు కేంద్రం మ్యాపింగ్ చేయాలని కలెక్టర్ అన్నారు. జిల్లా సరిహద్దుల్లో అవసరమైన చెక్ పోస్టులను ఏర్పాటు చేసి ఇతర రాష్ట్రాల నుంచి మనకు సన్న రకం వడ్లు రాకుండా చూడాలని అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో అవసరమైన మౌళిక వసతులు కల్పించాలని, ప్యాడీ క్లీనర్, వేయింగ్ యంత్రాలు, తేమ యంత్రాలు, మొదలగు వసతులు కల్పించాలని అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో త్రాగు నీరు, విద్యుత్ సరఫరా, లైట్లు మొదలగు సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. వేసవి దృష్ట్యా త్రాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలని, చల్లని త్రాగు నీరు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చూసుకోవాలని, అవసరమైన మేర ఓఆర్ఎస్ ప్యాకెట్లు పెట్టుకోవాలని అన్నారు. కొనుగోలు సమయంలో రైతులకు వడదెబ్బ తగిలే అవకాశాలను నివారించాలని అన్నారు. వడదెబ్బ తగిలితే వారికి ప్రాథమిక చికిత్స అందించే ఏర్పాటు చేయాలని అన్నారు. వేయింగ్, తేమ యంత్రాల పని తీరును చెక్ చేసి సర్టిఫై చేయాలని అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన గన్ని సంచులు, అకాల వర్షాల నుంచి పంట కాపాడేందుకు వీలుగా టార్ఫాలిన కవర్లు అందుబాటులో పెట్టుకోవాలని అన్నారు. ప్రతి సెంటర్ వద్ద ఉన్న గన్ని బ్యాగుల వివరాలను నోటీసు బోర్డుపై రాయాలని కలెక్టర్ తెలిపారు. కొనుగోలు కేంద్రాల వద్ద అవసరమైన హామాలీలు ఉండేలా చూడాలని అన్నారు. ఈ సమావేశంలో డిఆర్డిఓ సన్యాసయ్య, జిల్లా పౌరసరఫరాల అధికారి చందన్ కుమార్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి డి. పుల్లయ్య, పౌర సరఫరాల జిల్లా మేనేజర్ జి. శ్రీలత, జిల్లా మార్కెటింగ్ అధికారి ఎం.ఏ. అలీం, జిల్లా సహకార అధికారి గంగాధర్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా గంగాధర్‌రావు 14వ వర్ధంతి




**పెనుబల్లి, మార్చి20, (ప్రజాజ్యోతి):** నాడు పెనుబల్లి మండల%శీ%లో కేవలం నలుగురు సభ్యులుతో ఉన్న సీపీఎం ఎర్రజెండా ను మండలంలో నలుమూలలకు విస్తరింపజేసిన మార్క్సిస్టు పార్టీ ముద్దుబిడ్డ అమరజీవి చలమాల గంగాధర్ రావు అని సీపీఎం రాష్ట్ర కమిటి సభ్యురాలు మాచర్ల భారతి అన్నారు. గురువారం మండల పరిధిలోని వీఎం బంజర పట్టణంలో గల గంగాధర్ రావు స్థూపం వద్ద మండల నేత తాండ్ర రాజేశ్వరరావు అధ్యక్షతన చలమాల 14 వ వర్ధంతి సభ జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మాచర్ల మాట్లాడుతూ నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి కడవరకు ఎర్రజెండాతో చెలిమి చేసిన గొప్ప వ్యక్తి గంగాధరరావు అని కొనియాడారు. ప్రజలను మతాల పేరుతో కేంద్ర బీజేపీ మోడీ సర్కారు విడదీస్తూ కొట్టుకున్నేలా చేస్తూ లౌకిక దేశంగా వున్న ఇండియాను హిందూత్వ దేశంగా మార్చే కుట్ర చేస్తుందన్నారు. ముందుగా స్థూపం వద్ద సీపీఎం జెండాను ఆమె ఆవిష్కరించారు. అనంతరం చిత్ర పటానికి సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాదినేని రమేష్, సత్తుపల్లి డివిజన్ కార్యదర్శి శీలం సత్యనారాయణరెడ్డి లు పూలమాల వేసి నివాళు లర్పించారు. మాదినేని మాట్లాడుతూ నేడు దేశంలో సంపద సృష్టిస్తున్న శ్రామికుల, కష్టజీవుల, కూలీల, కర్షకుల కష్టాన్ని కర్కశంగా జాతీయ, అంతర్జాతీయ కార్పొరేట్లకు కారుచౌకగా కట్టబెడుతున్న కేంద్ర మోడీ సర్కారు పై పోరాటమే గంగాధరరావు కు ఇచ్చే ఘన నివాళి అవుతుందని తెలిపారు. డివిజన్ కార్యదర్శి శీలం సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ప్రజలకు ఆరు గ్యారెంటీ లు ఇస్తామని నమ్మబలికించి అధికారంలోకి వచ్చి 15 నెలలు గడిచినా అమలు చేయడం లేదని, ఇతర ప్రజా సమస్యలను గాలికోదిలేసి గత బి.ఆర్.ఎస్. ప్రభుత్వంపై రాజకీయ విమర్శలు చేస్తూ పబ్బం గడుపుకుంటుందని అట్టి ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమాలు చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. సభకు నేతలను సీపీఎం మండల కార్యదర్శి గాయం తిరుపతిరావు పరిచయం చేశారు. ఈ కార్యక్రమంలో తల్లాడ, కల్లూరు మండలాల సీపీఎం కార్యదర్శులు అయినాల రామలింగేశ్వరరావు, మాదాల వెంకటేశ్వరరావు, సీఐటీయూ రాష్ట్ర కమిటి సభ్యులు చలమాల విఠల్ రావు, జిల్లా ఉపాధ్యక్షులు మల్లూరు చంద్రశేఖర్, సీపీఎం డివిజన్ కమిటి సభ్యులు మిట్టపల్లి నాగమణి, నల్లమల అరుణ్ ప్రతాప్, కండే సత్యం, చలమాల నరసింహారావు, తడికమళ్ళ చిరంజీవి, కలకోట అప్పారావు, కాంగ్రెస్ నేత అన్నపురెడ్డి శ్రీనివాసరావు, మేకల బాజీ, ఎస్ఎఫ్ఐ జిల్లా నేత బెజవాడ సాయి, ప్రజా పంథా నేత కాటినేని శ్రీను, యాదవ సంఘం నేత కర్రి వెంకటేశ్వరరావు, విశ్రాంత ఉపాధ్యాయుల సంఘం నేత గోపిశెట్టి వెంకటేశ్వరరావు, టాక్సీ డ్రైవర్ యూనియన్ నేత రవి, టైలర్ ల నేత బాషా, హమాలీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# జై బాపు, జై భీమ్, జై సంవిధాన్‌లను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



**ఖమ్మం ప్రతినిధి, (ప్రజా జ్యోతి) :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు విద్య ఉద్యోగం రాజకీయాలలో 42 శాతం రిజర్వేషన్ ఇవ్వటం. ఎస్సీలను ఒకటి రెండు మూడు విభాగాలుగా వర్గీకరించి రిజర్వేషన్ ప్రకటించటం గురించి మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరావు క్యాంపు కార్యాలయంలో గురువారం సాయంత్రం నగర కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ అధ్యక్షులు బాణాల లక్ష్మణ్ అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పూవ్వాళ్ళ దుర్గ ప్రసాద్ మాట్లాడుతు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినాక అభివృద్ధి సంక్షేమం రెండు కల్లుగా భావించి ఎన్నికలలో ఇచ్చిన అనేక హామీలను నెరవేర్చడం జరిగింది ఆ హామీలు అన్నిటిని కూడా ప్రజల్లోకి చేరే విధంగా కార్యకర్తలు పాటుపడాలని అన్నారు. దేశ చరిత్రలో ఏ రాష్ట్రం చేయని విధంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఈ భారత దేశంలో అత్యధిక జనాభా కలిగిన బీసీలకు విద్య ఉద్యోగం రాజకీయాలలో 42 శాతం రిజర్వేషన్ కల్పించి అసెంబ్లీలో బిల్లు ఆమోదింపచేయడం చారిత్రాత్మక అంశమని, అదే విధంగా ఎన్నో ఏండ్లు గా పెండింగ్లో ఉన్న ఎస్సీలను మూడు భాగాలుగా వర్గీకరించి రిజర్వేషన్ కల్పించిన ఘనత ఈ రాష్ట్ర ప్రభుత్వానిది అని వీటిని ప్రజలకు వివరించాల్సిన బాధ్యత కార్యకర్తలు నాయకులపై ఉందని అన్నారు. గౌరవ మంత్రి వర్యులు తుమ్మల నాగేశ్వరరావు గారు దిశ నిర్దేశం ప్రకారం ప్రతి గ్రామంలో మున్సిపల్ కార్పొరేషన్ లో ప్రజలకు వివరించాల్సిన బాధ్యత మనందరి మీద ఉన్నదని అన్నారు. మేయర్ పునుకోల్లు నీరజ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ దశాబ్దాల చరిత్ర గల పార్టీ అని ప్రతి కార్యకర్త సైనికుని లాగ పనిచేసి పార్టీ నీ అధికారంలోకి తేవడం జరిగిందని అన్నారు బీసీ రిజర్వేషన్, ఎస్సీ వర్గీకరణ ద్వారా ఈ రాష్ట్ర ప్రభుత్వం చరిత్రలో నిలిచిపోతుందని అన్నారు. అత్యంత పారదర్శక పరిపాలన అందిస్తున్న రాష్ట్రం ఏదైనా ఉందంటే అది తెలంగాణ రాష్ట్రం ఒక్కటే అని అన్నారు. కమర్తపు మురళీ మాట్లాడుతూ %ఱ% బీసీ ల పక్షపాతిగా నిలిచిన కాంగ్రెస్ పార్టీ కి బీసీలు జీవితాంతం ఋణ పడి ఉండాలని అన్నారు. నగర కాంగ్రెస్ పార్ట్ బిసి సెల్ అధ్యక్షులు బాణాల లక్ష్మణ్ మాట్లాడుతూ మా జాతీయ నాయకుడు రాహుల్ గాంధీ ఎన్నికల ప్రచారం లో ఇచ్చిన బీసీ డిక్లరేషన్ ను తూచా తప్పకుండా అమలు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్య మంత్రి కి, ఉప ముఖ్య మంత్రి కి వ్యవసాయ శాఖ మంత్రి వర్యులు తుమ్మల నాగేశ్వరరావు కి బీసీలు గా ధన్యవాదాలు తెలియచేస్తున్నమని, విద్య,ఉద్యోగ,రాజకీయాలలో 42% రిజర్వేషన్ కల్పించినందుకు ఊపిరి ఉన్నంత వరకు బీసీలు కాంగ్రెస్ పార్టీకి అండగా ఉంటారని అన్నారు.ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఎరగర్ల హనుమంతరావు ఆత్మ కమిటీ చైర్మన్ దిరిశాల దిరిశాల చిన్న వెంకటేశ్వర్లు జిల్లామహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య రైతు సంఘం నాయకులు నల్లమల వెంకటేశ్వరరావు ఏ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఎర్రం బాలగంగాధర్ తిలక్, రఘునాథపాలెం మండల కాంగ్రెస్ నాయకులు దీప్లా నాయక్, ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కార్పొరేటర్లు డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు అన్ని అనుబంధ సంఘాల అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.

# సీఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ



**కూసుమంచి, మార్చి 20, (ప్రజా జ్యోతి) :** వివిధ చికిత్సల అనంతరం ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకున్న వారికి మంజూరైన చెక్కులను ఆయా లబ్ధిదారులకు కూసుమంచి క్యాంప్ కార్యాలయంలో ఇంచార్జిభీమిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, నాయకులతో కలిసిమంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సిఫారసు మేరకు మంజూరైన 25 చెక్కులకు గాను రూ.6.89 లక్షలు గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఇంచార్జి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ అత్యవసర ఆరోగ్య సమస్యలున్న వారికి అపన్న హస్తంగా సీఎం సహాయ నిధి ఉపయోగ పడుతుంది అని ఆయన అన్నారు. సీఎం రిలీఫ్ ఫండ్ బాధితులకు భరోసా కలిగిస్తున్నది అని అన్నారు. తమకు ముఖ్యమంత్రి సహాయ నిధులు రావడానికి సహకరించిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ని లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలోసిడిసి చైర్మన్ ఏర్రబోలు సూర్యనారాయణ రెడ్డి, నెలకొండపల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్ చాట్ల సత్యనారాయణ, కూసుమంచి మాజీ ఎంపీటీసీ మాదాసు. ఉపేందర్, మాజీ సర్పంచి భారీ వీరభద్రం,నాయకులు మొహమ్మద్ హఫీజ్ ఉద్దిన్, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు కొండ శ్రీనివాసరావు మండల నాయకులుకంచర్ల జీవన్ రెడ్డి, ముల్కురి శ్యామ్ సుందర్ రెడ్డి, మల్సూర్, బిక్షం నాయక్, బిష్మ చారి, కణతల నాగయ్య, యూత్ విభాగం నాయుడు బెల్లంకొండ శరత్ గౌడ్, మొహమ్మద్ రఫీ, కుమార్, వడిత్య సైదా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలపై ఎంపీడీవోకి వినతి



**తల్లాడ, మార్చి 20 (ప్రజా జ్యోతి) :** ఎన్నో సంవత్సరాల నుండి గ్రామ పంచాయతీలలో విధులు నిర్వహిస్తున్నారు. ప్రతి ఒక్క కార్మికుడికి ప్రతి నెల జీతం అందే విధంగా చూడాలని, ముఖ్యమంత్రి ప్రకటించిన విధంగా ప్రత్యేక బడ్జెట్ కేటాయించి గ్రీన్ ఛానల్ ద్వారా వేతనాలు చెల్లించాలని, పెండింగ్ జీతాలు ఇప్పించాలని, పంచాయతీ కార్మికుడు చనిపోతే, వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, ఎవరికైనా లైసెన్స్ లేకపోతే వారికి ట్రాక్టర్ డ్రైవింగ్ లైసెన్స్ ఇప్పించాలని, ఈఎస్ఐ, పి. యఫ్ సౌకర్యం కల్పించాలని ఎంపీడీవో కి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో తల్లాడ మండల గ్రామ పంచాయతీ కార్మికుల యూనియన్ అధ్యక్షుడు. ఇమ్మడి రామకృష్ణ, ఉపాధ్యక్షుడు, బొగ్గుల కృష్ణారెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి, లాజరు, వెంకటేశ్వర్లు, కృష్ణ, దాసు, రవి, నారాయణ, వీరాంజనేయులు, మురళి, ప్రభాకర్, బుజ్జి, ఆరోను, రాంబాబు పాల్గొన్నారు.

## మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డిని కలిసిన షేక్ యాకూబ్ పాషా..



**తల్లాడ, మార్చి 20 (ప్రజా జ్యోతి) :** తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డిని తల్లాడ మండలంలోని అన్నారుగూడెం గ్రామానికి చెందిన ముస్లిం మైనార్టీ నాయకులు షేక్. యాకుబ్ పాషా కలిశారు. గురువారం ఖమ్మం లోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు సమస్యలను ఆయనకు విన్నవించారు. అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇల్లు, అదేవిధంగా రాజీవ్ యువ వికాసం పథకంలో నిరుద్యోగులను, పేదలను గుర్తించి గుర్తించాలని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన మంత్రి పొంగులేటి ప్రతి ఒక్క అర్హులైన కుటుంబాలకు ప్రభుత్వ పథకాలు అందుతాయని, ఎవరు అధైర్య పడద్దని తెలిపారు. రానున్న రోజుల్లో అన్ని వర్గాల ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతాయని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మంత్రికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## మాలతీకి నివాళులర్పించిన రాయల రాము, తుమ్మలపల్లి రమేష్

**తల్లాడ, మార్చి 20 (ప్రజా జ్యోతి) :** తల్లాడ మండలంలోని బిల్లుపాడు గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ నల్లమోతు మాలతి ఇటీవల మృతి చెందిన విషయం తెలిసిందే. గురువారం ఖమ్మంలో ఆమె దశదినకర్మ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ తల్లాడ మండల నాయకులు రాయల రాము, తుమ్మలపల్లి రమేష్ హాజరై ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. నివాళులర్పించిన వారిలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దీవెల కృష్ణయ్య, ఐనాల నరసింహారావు, ఆ గ్రామ నాయకులు పాల్గొన్నారు.



# జర్నలిస్టుల సంక్షేమమే టీడబ్ల్యూజేఎఫ్ లక్ష్యం

### జర్నలిస్టులందర్ని ఐక్యం చేస్తున్నాం

### ఖమ్మం జిల్లాలో నెంబర్ వన్ స్థానం మనదే అవుతుంది

### టీ డబ్ల్యూ జె ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బి. రాజశేఖర్

### జర్నలిస్టుల కోసం అనేక పోరాటాలు నిర్వహించాం:కె శ్రీనివాస్ రెడ్డి

### కూసుమంచిలో ఉత్సహంగా జర్నలిస్ట్ ల సభ్యత్వ నమోదు కార్యక్రమం



**కూసుమంచి, మార్చి 20 (ప్రజా జ్యోతి) :** జర్నలిస్టుల సంక్షేమమే లక్ష్యంగా టీ డబ్ల్యూ జె ఎఫ్ (తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్) పనిచేస్తుందని, రాష్ట్రంలో జర్నలిస్టుల సంక్షేమం కోసం అనేక పోరాటాలు నిర్వహించి, ఎన్నో విజయాలను సాధించడం టీడబ్ల్యూజెఎఫ్ తోనే సాధ్యమైందని సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి. రాజశేఖర్, జిల్లా కార్యదర్శి కె. శ్రీనివాస్ రెడ్డి అన్నారు. గురువారం కూసుమంచి మండల కేంద్రంలోని ఎస్.ఆర్ బ్రదర్స్ ఫంక్షన్ హాల్ లో జరిగిన టిడబ్ల్యూజెఎఫ్ సభ్యత కార్యక్రమం సీనియర్ జర్నలిస్ట్ లు పెంద్ర అంజయ్య, ఉల్లోజు కర్ణబాబు ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా యూనియన్ నాయకులు, జర్నలిస్ట్ లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో, జిల్లాలో జర్నలిస్టుల సమస్యల కోసం, వారి హక్కుల కోసం నిరంతరం పోరాటాలు నిర్వహిస్తూ విజయాలు సాధిస్తున్న సంఘం టీడబ్ల్యూజెఎఫ్ సంఘం మాత్రమేనని అన్నారు. ఈ సంఘం ద్వారా అనేక విజయాలు సాధించామని గుర్తు చేశారు. ముఖ్యంగా జర్నలిస్టుల ఇండ్లు, ఇళ్ల స్థలాల కోసం అనేక పోరాటాలు నిర్వహించి, అందులో విజయం సాధించామని తెలియజేశారు. అలాగే ఆర్టీసీ బస్సులో, ఏసీ బస్సులను జర్నలిస్టులకు సౌకర్యం కల్పించింది టీ డబ్ల్యూజెఎఫ్ అని గుర్తు చేశారు. జర్నలిస్టుల హెల్త్ విషయంలో కార్పొరేట్ వైద్యంతో పాటు, ప్రభుత్వ హాస్పిటల్ లో కూడా మెరుగైన వైద్యం చేయించడం కోసం సంఘం పోరాటం చేయడంతో, వారి పోరాట ఫలితంగా ప్రభుత్వం సిఫారసులు చేయడం జరిగిందని అన్నారు.

**జర్నలిస్టుల ఐక్యతతోనే ఏదైనా సాధ్యం : ఖదీర్**

ఖమ్మం జిల్లాలో ఉన్న జర్నలిస్టులందరు ఐక్యతతో ఉంటే ఏదైనా సాధించడం ఖాయమని, జర్నలిస్టులు అందరూ ఐక్యంగా ఉండాలని, ఒకే గొడుగు కిందకు రావాలని వి6 జిల్లా స్టాఫ్ రిపోర్టర్, సంఘం నాయకులు ఖదీర్ పిలుపునిచ్చారు. ఈ సంఘం ఎల్లప్పుడూ మీకు తోడ్పాటు అందిస్తుందని, మండలంలోని నూతనంగా సభ్యత్వం తీసుకున్న వారికి టి డబ్ల్యూజెఎఫ్ ఎల్లప్పుడూ మీకు అండదడలుగా ఉంటుందని వారు హామీ ఇచ్చారు. కొత్తగా యూనియన్లో చేరిన వారిపై కొందరు జర్నలిస్టులు తప్పుడు ప్రచారం చేస్తే కచ్చితంగా ఊరుకునేది లేదని, తరువాత జరిగే పరిణామాలకు వారే బాధ్యులు అవుతారని హెచ్చరించారు.

**గ్రామీణ స్థాయి జర్నలిస్టుల కోసం పోరాటం చేస్తున్నాం : సాగర్**

ఖమ్మం జిల్లాలో టీడబ్ల్యూజెఎఫ్ సంఘం ఆధ్వర్యంలో పట్టణ స్థాయి జర్నలిస్టుల తో పాటు గ్రామీణ స్థాయి జర్నలిస్టుల కోసం పోరాటం చేస్తున్నామని, ఈ పోరాట ఫలితంగా సక్సెస్ కూడా చూస్తూనే ఉన్నామని అన్నారు. గతంలో ఏ సంఘం కూడా గ్రామీణస్థాయి జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం ప్రయత్నం చేయలేదన్నారు. మా పోరాటానికి మండల స్థాయిలో జర్నలిస్టుల సపోర్టు మాకు ఉంటే, మీ పోరాటం తోడు ఉంటే జయించలేనిదేమి ఉండదన్నారు. మీ అందరికి తోడుగా ఉంటామని హామి నిచ్చారు.

**ఉత్సాహంగా సభ్యత్వ నమోదు కార్యక్రమం**

కూసుమంచి మండలంలో టీడబ్ల్యూ జె ఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమం ఉత్సాహపూరిత వాతావరణంలో జరిగింది. మండలంలో వివిధ పత్రికల్లో పని చేస్తున్న 18 మంది జర్నలిస్టులకు టీడబ్ల్యూజెఎఫ్ నూతన సభ్యత్వలను రాష్ట్ర, జిల్లా నాయకత్వం అందజేశారు. టి డబ్ల్యు జే ఎఫ్ సీనియర్ సభ్యులు కర్ణబాబు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లా నాయకులు వేగినాటి మాధవరావు,జానీ, సుభానీ, మండల సభ్యులు పెంద్ర అంజయ్య, ఎస్. గోవిందరెడ్డి, పందిరి వెంకట్ రెడ్డి,గరిణి నాగేశ్వరరావు, ఎండీ. రంజాన్ అలీ, వడ్డెబోయిన వెంకయ్య, కొండా శ్రీనివాస్, భూక్య రాజేష్, మెడవరపు రామబ్రహ్మం, కొలికపొంగు సతీష్, వి. జనార్ధన్, వెంకటేశ్వర్లు, కొమ్ము వెంకటేష్, పోశం నాగార్జున, రాయబారపు రమేష్, ఎస్. కె. జాఫర్, తదితరులు పాల్గొన్నారు.



## సీసీరోడ్డుకు శంకుస్థాపన చేసిన కాంగ్రెస్ నాయకులు వడ్డే రామారావు

**తల్లాడ, మార్చి 20 (ప్రజా జ్యోతి) :** తల్లాడ మండలంలోని కలకోడిమ గ్రామంలో సీసీ రోడ్డుకు కాంగ్రెస్ పార్టీ తల్లాడ మండల నాయకులు వడ్డే రామారావు గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సత్తుపల్లి శాసనసభ్యురాలు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ కృషితో సిసి రోడ్లు మంజూరైనట్లు వెల్లడించారు. ఈజీఎస్ నిధులు 30 లక్షలు మంజూరు కావడంతో గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. నిధులను మంజూరు చేసిన ఎమ్మెల్యే రాగమయి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు మట్టా దయానంద్ కు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ ఆదూరి దాసు రావు, సెక్రెటరీ ప్రశాంత్, గ్రామ ప్రత్యేకాధికారి శ్రీనివాసరెడ్డి, స్థానికులు పాల్గొన్నారు.

# రైతులు నీటిని పొదుపుగా వాడుకోవాలి

## కూసుమంచి డివిజన్ సహాయ సంచాలకులు సరిత

**కూసుమంచి, మార్చి 20 (ప్రజా జ్యోతి) :** కూసుమంచి మండలంలోని నాయకన్ గూడెం గ్రామంలో రైతులకు కూసుమంచి డివిజన్ సహాయ సంచాలకులు సరిత మండల వ్యవసాయ అధికా రిణి రామడుగు వాణి అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణ పరిస్థితులలో భూగర్భ జలాలు తగ్గిపోతున్నట్లు గమనించడం జరిగిందని, దీనిని అధిగమించేందుకు జిల్లా కలెక్టర్ సహకారంతో రైతుల వ్యవసాయ భూముల్లో నీటి కుంటలను ఈజీఎస్ ద్వారా తవ్వించేందుకు నిర్ణయించారని కావున ఈ అవకాశాన్ని రైతులందరూ వినియోగించుకోవాలని సూచించారు. వ్యవసాయ భూమిలో వాలు ఉన్న ప్రదేశంలో భూమిని చూపించినట్లైతే రైతులకు ఎటువంటి ఖర్చు లేకుండా వారి కోరిన పరిమాణంలో నీటి గుంటలు తవ్వించి ఏర్పాటు చేస్తారని,తద్వారా వర్షపు నీటిని నిల్వ వుంచుకొనే అవకాశం ఉందని తెలియజేశారు. కావున ఆసక్తిగల రైతులు వ్యవసాయ శాఖ ఏఈఓ లను కానీ మండల వ్యవసాయ అధికారిని గాని సంప్రదించాలని కోరారు. అనంతరం రైతులకు పామ్ ఆయిల్ పంట సాగుపై అవగాహన కల్పించారు. పామాయిల్ పంట సాగులో ఉన్న సబ్సిడీ విధానాలను రైతులకు వివరించారు. అనంతరం వరి కోతల గురించి, సాగునీటి లభ్యత గురించి రైతులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి సౌమ్య రైతులు పాల్గొన్నారు.



# అప్పులున్నా వాగ్దానాలు మరువం

## వెసులుబాటుతో 6 గ్యారెంటీలను అమలు చేస్తాం

## నాలుగేళ్లలో 20 లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణమే లక్ష్యం

## మంత్రి పొంగిలేటి శ్రీనివాసరెడ్డి



**కల్లూరు, మార్చి20 (ప్రజా జ్యోతి) :** తెలంగాణ రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసి కాంగ్రెస్ ప్రభుత్వం వాగ్దానాలను నెరవేర్చడం లేదని ప్రజలను తప్పు దోవ పట్టించేందుకు గత ప్రభుత్వం బిఆర్ఎస్ కాకి గోల పెడుతూ ప్రభుత్వాన్ని ట్రాప్ చేయాలని చూస్తుందని అలాంటి మాయల గారడి మాటలకు రేవంత్ ప్రభుత్వం తలొగ్గదని మండలంలోని పలు శంకుస్థాపన, ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ,సమాచార శాఖ మంత్రి పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు.గురువారం కల్లూరు మండలం పెద్దకోరుకొండి గ్రామంలో 95 లక్షల అంచనా వ్యయంతో చేపట్టిన అంతర్గత సీసీ రోడ్లు,డ్రెయిన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి,డి.ఎం.ఎఫ్.టి నిధులు 25 లక్షలతో నిర్మించిన లైబ్రరీ,రీడింగ్ హాల్ ను ప్రారంభించారు.యర్రబోయినపల్లి గ్రామంలో సి.ఆర్.ఆర్.నిధులు ఒక కోటి 77.50 లక్షలతో చేపట్టిన అంతర్గత సీసీ రోడ్లు,డ్రెయిన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం పదేళ్ల పాలనలో ఎనిమిది లక్షల 19 వేల కోట్ల రూపాయలు అప్పులు చేసిందని అందుకు మన ప్రభుత్వం నెలకు 6500 కోట్ల రూపాయలు చెల్లించాల్సి వస్తుందని అన్నారు. ఐనా ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన 6 గ్యారంటీలను ఆర్థిక వెసులుబాటుతో అమలు చేస్తుందని అన్నారు.కాంగ్రెస్ పార్టీ అంటేనే పేదవాడి పార్టీ అని అన్నారు.ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో 10 ఏళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం 25 లక్షల ఇళ్ళునిర్మిస్తే,బిఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లలో 1,51 వేలు ఇళ్లు మొదలుపెట్టి 90వేలు మాత్రమే పూర్తి చేసిందని సామాన్య ప్రజలను ఇబ్బంది పెట్టకుండా అసంపూర్తిగా మిగిలిన 61 వేల ఇళ్లను పూర్తి చేస్తున్నామని తెలిపారు.ప్రస్తుతం రేవంత్ ప్రభుత్వం నాలుగేళ్లలో దశలవారీగా 20 లక్షల ఇందిరమ్మ ఇళ్లను నిర్మించేందుకు సిద్ధమైందని గూడు లేని పేదవాడు ఉండకూడదని చిత్తశుద్ధితో పనిచేస్తున్నామని తెలిపారు.దేశంలో ఎక్కడా లేనివిధంగా ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీకి 20 లక్షల ఆరువందల 76 కోట్ల రూపాయలు నిధులు ఇచ్చామని తెలిపారు.

**యర్రబోయినపల్లి సమస్యలపై మంత్రి హామీ..**

ఎస్సీ,ఎస్టీ సబ్ ప్లాన్ నిధులతో నిర్మించనున్న సిసి రోడ్లు,డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేయడానికి వచ్చిన రాష్ట్ర మంత్రి పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డికి యర్రబోయినపల్లి కాంగ్రెస్ నాయకులు,గ్రామస్తులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. గ్రామంలో మొద్దుల చెరువు ఆయకట్టు కింద వేల ఎకరాలు సాగులో ఉన్నాయని కానీ చెరువు కట్టపై రైతు వారి పనులకు ఇబ్బంది కలుగుతుందని కట్ట మరమ్మత్తులు తూము రిపేర్లు చేయించాలని కోరారు. యర్రబోయినపల్లి పూర్తిగా వ్యవసాయ ఆధారిత గ్రామమని అంతర్గత రోడ్లకు గ్రావెల్ తోలించాలని, ఆంధ్రప్రదేశ్ తెలంగాణ కు సరిహద్దు ప్రాంతమైన యర్రబోయినపల్లి నుండి తిరువూరు వెళ్లే దారి అధ్వానంగా ఉందని రోడ్డు నిర్మాణం ఏర్పాటు చేయాలని కోరారు.ప్రజా సమస్యలపై స్పందించిన ఆయన సంబంధిత అధికారులతో మాట్లాడి చేయిస్తానని హామీ ఇవ్వడం జరిగింది.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్,రాష్ట్ర ఇరిగేషన్ శాఖ కార్పొరేషన్ చైర్మన్ మువ్వా విజయ్ బాబు,అన్ని శాఖల ప్రభుత్వ అధికారులు,కల్లూరు ఏఎంసి చైర్మన్ భాగం నీరజ దేవి,స్థానిక నాయకులు పోట్రూ అర్జున్ రావు,పోట్రూ సత్యం,బత్తుల రాము,పోట్రూ శ్రీనివాసరావు,ఏఎంసి డైరెక్టర్ దొడ్డుపనేని శ్రీనివాసరావు,సొసైటీ డైరెక్టర్ బండి శ్రీనివాసరావు,కాకర్ల రంగారావు,యాసా శ్రీకాంత్ సత్తుపల్లి నియోజకవర్గం 5 మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, 5 మండలాల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు,మహిళా కాంగ్రెస్ నాయకులు,మండల కాంగ్రెస్ నాయకులు,యర్రబోయినపల్లి కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# కాలువలో పడి చిన్నారి మృతి



**కల్లూరు, మార్చి 20 (ప్రజా జ్యోతి) :** మండల పరిధి తాళ్లూరు వెంకటాపురం గ్రామానికి చెందిన జెర్రిపోతుల సుధీర్ అనూష పెద్ద కుమార్తె చిన్నారి(3) తల్లాడ మండలం అన్నారుగూడెంలో వారి అమ్మమ్మ ఇంటి వద్దకు వెళ్లిన చిన్నారి కాలువలో జారిపడి మృతి చెందింది.విషయం తెలుసుకున్న చిన్నారి తల్లిదండ్రులు చిన్నారిని తన స్వగ్రామం అయిన తాళ్లూరు వెంకటాపురం గ్రామానికి తీసుకురావడం జరిగింది.సుధీర్ అనూష కు ఇద్దరు కుమార్తెలు పెద్ద కుమార్తె అని చిన్నారి మృతి ప్రతి ఒక్కరినీ కంటతడి పెట్టించింది.గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి తల్లిదండ్రులు రోదిస్తున్న తీరును ప్రతి ఒక్కరు జీర్ణించుకోలేకపోతున్నారు.

# సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేసిన కాంగ్రెస్ నాయకులు



**కారేపల్లి, మార్చి 20, (ప్రజా జ్యోతి) :** బీసీ రిజర్వేషన్ బిల్లు, ఎస్సీ వర్గీకరణ బిల్లు ,రాజీవ్ యువ వికాసం, ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ సింగరేణి మండల కాంగ్రెస్ నాయకులు గురువారం మండల పార్టీ కార్యాలయంలో సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికలలో ఇచ్చిన హామీల మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమం కోసం ఎనలేని కృషి చేస్తుందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు తలారి చంద్రప్రకాష్, రాష్ట్ర మహిళా నాయకురాలు పగడాల మంజుల, టౌన్ ప్రెసిడెంట్ డాక్టర్ శ్రీను, మైనారిటీ సెల్ అధ్యక్షుడు తాజుద్దీన్, బీసీ సెల్ అధ్యక్షుడు బోల్ల రమేష్, సొసైటీ డైరెక్టర్ అడ్డగోడ ఐలయ్య, జిల్లా వాణిజ్య విభాగ ఉపాధ్యక్షులు సురేందర్ మణియర్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు మేదరి టోనీ, ఎస్టీ సెల్ అధ్యక్షుడు గోపాల్, గడ్డమీద రామారావు, హనీఫ్, అదేర్ల రాములు, హర్షనాయక్, కురసం సత్యనారాయణ, స్వామి, నాగరాజు, దేగల ఉపేందర్, కబీర్, తదితరులు పాల్గొన్నారు.

# బండ్ల లక్ష్మమ్మకి నివాళిలర్పించిన జర్నలిస్టులు

**తిరుమలాయపాలెం, మార్చి 20, (ప్రజా జ్యోతి) :** తిరుమలాయపాలెం మండలంలోని మేడిదపల్లి గ్రామానికి చెందిన బిఆర్ఎస్ నాయకులు, మాజీ సర్పంచ్ బండ్ల సురేష్ మాతృమూర్తి బండ్ల లక్ష్మమ్మ ఇటీవల మరణించారు. గురువారం నిర్వహించిన దశధిన కర్మకు మండలంలోని జర్నలిస్టులు హాజరై లక్ష్మమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. కుమారులు బండ్ల ముత్తయ్య, నాగేశ్వరావు, సురేష్, అశోక్ సోదరులను పరామర్శించి ఓదార్చి, అధైర్య పడొద్దని మనో ధైర్యం కల్పించారు.ఈ కార్యక్రమంలో సీనియర్ టి యు డబ్ల్యూ జే ఐ జి యు జిల్లా కమిటీ సభ్యులు పప్పుల శ్రీనివాసరావు, కూరపాటి విజయ్, గోవింద వెంకట్, గుజ్జా రామకృష్ణ, కొండ్రు రమేష్, పి.వెంకన్న, గోవింద సురేష్, తదితరులు పాల్గొన్నారు.



# మోసపూరితమైన పట్టాలను చూపించి భూమిని అమ్మిన ఇద్దరికీ రిమాండ్

**ఖమ్మం ప్రతినిధి, (ప్రజా జ్యోతి) :** నాయుడుపేట ఖమ్మం రూరల్ మండలానికి చెందిన మానుకొండ శ్రీనివాస్ పోలేపల్లి గ్రామం ఖమ్మం రూరల్ మండలం కు చెందిన వెలుతురు శ్రీనివాస్ రఘునాథపాలెం రెవిన్యూ గ్రామంలో లేని ఇళ్ల స్థలాన్ని ఉన్నట్టుగా చూపించి పాకబండ బజార్ బోనకల్ ఎక్స్ రోడ్ ఖమ్మం కి చెందిన కాకుమాని రామారావుకి అతనికి 200 గజాల ఇళ్ల ప్లాటును మోసపూరితంగా అమ్మి 18 లక్షల రూపాయలు తీసుకొని ఉద్దేశపూర్వకంగా మోసగించినందున, అదేవిధంగా మానుకొండ శ్రీనివాస్ మరో ముగ్గురిని ఖమ్మంలో ఎవరికో చెందిన ఇళ్ల స్థలాన్ని తనవిగా చూపించుకొని వారి వద్ద నుండి డబ్బులు తీసుకొని మోసగించినందున ఖమ్మం సిసిఎస్ పోలీస్ స్టేషన్ నందు కేసు నమోదు చేయబడినందున గురువారం ఇద్దరినీ అరెస్టు చేసి న్యాయస్థానం ముందు రిమాండ్ నిమిత్తం పంపనైనది. రఘునాథపాలెం సీఐ ఉస్మాన్ షరీఫ్.

# తెల్ల చేపలు లో రోగాలపై మత్స్యకారులకు అవగాహన సదస్సు

## పాలేరు మత్స్యశాఖ పరిశోధన కేంద్రం డాక్టర్ ఎం శ్యామ్ ప్రసాద్

**కూసుమంచి, మార్చి 20 (ప్రజా జ్యోతి) :** మత్స్య పరిశోధన స్థానం పాలేరు పి.వి నరసింహారావు తెలంగాణ పశువైద్య విశ్వవిద్యాలయము హైదరాబాదు వారి ఆధ్వర్యంలో మత్స్య శాఖ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాదు వారి సహకారంతో, భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి, న్యూఢిల్లీ వారి ఆర్థిక సహకారంతో, ములుగు జిల్లా తెలంగాణ (షెడ్యూల్ ట్రైబ్) మత్స్య కారులకు జరుగుతున్న మత్స్య రంగంపై క్షేత్రస్థాయి సందర్శన అను అంశంపై 3 రోజుల క్షేత్రస్థాయి శిక్షణా కార్యక్రమం (రెండవ బ్యాచ్) మొదటి రోజు కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ ఎం. శ్యామ్ ప్రసాద్, సీనియర్ శాస్త్రవేత్త మరియు హెడ్ మాట్లాడుతూమత్స్య రంగంపై క్షేత్రస్థాయి సందర్శన అను అంశంపై జరుగుతున్న ఈ క్షేత్రస్థాయి శిక్షణ కార్యక్రమాన్ని మన ములుగు జిల్లా మత్స్యకారులందరూ సద్వినియోగ పరుచుకుని మరింత స్థాయికి ఎదగాలని కోరారు. మత్స్యకారులు నగేష్ ఆక్వా ఫార్మ్స్ జుజ్జులరావుపేటలో వెనామీ రొయ్యల పట్టుబడి పెంపకం గురించి, తెల్ల చేపల పెంపకం పౌల్ట్రీ కం ఫిష్ కల్చర్ గూర్చి , రాజా ఫిషరీస్ అండ్ ఆర్చిడ్స్, నాచేపల్లి లో తెల్ల చేపలు రూప్ చందా చేపల పెంపకం గురించి మరియు వెంకటేశ్వర ఫిష్ ఫార్మ్స్ లో తెల్ల చేపలలో వచ్చే వివిధ రోగాల గురించి క్షేత్రస్థాయిలో మత్స్యకారులను అడిగి తెలుసుకున్నారు.అదేవిధంగా మత్స్య పరిశోధన స్థానం పాలేరు ఖమ్మం జిల్లాలో మత్స్య రైతులు పాలేరు మత్స్య పరిశోధన స్థానంలో ఉన్న బయో ఫ్లాక్ టెక్నాలజీ, కోళ్లు చేపల పెంపకం, తెల్ల చేప పిల్లల తయారీ కేంద్రం గూర్చి, రంగు చేపల గురించి మరియు ఆక్వాపోనిక్స్ సిస్టం గురించి మత్స్య పరిశోధన స్థానం పాలేరు శాస్త్రవేత్తలు రైతులకు సంక్షిప్తంగా వివరించారు. ఈ కార్యక్రమంలో 10 మంది మత్స్యకారులు ములుగు జిల్లా నుండి పాల్గొన్నారు.



